పరమపావనం.. పంచేశ్వర క్షేత్ర దర్శనం

- రూపాల సంగమేశ్వర స్వామి ఆలయంలో నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన జగన్నాథ గట్టు అభివృద్ధి సమితి





శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన శ్రీ ఉమా సమేత రూపాల సంగమేశ్వర స్వామి దేవాలయం, రూపాల సంగమేశ్వరుడు

కర్నూలు కల్చరల్: మహాశివరాత్రి ఉత్సవాలకు శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. కర్నూలు నగరానికి దక్షిణాన దిన్నెదేవరపాడు గ్రామ పొలిమేరలో జగన్నాథ గట్టుపై వెలసిన శ్రీ రూపాల సంగమేశ్వర స్వామి ఆలయంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ప్రతి ఏటా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని లక్షలాది మంది భక్తులు సందర్శించే ఈ రూపాల సంగమేశ్వరాలయం కపిలేశ్వరం, సోమేశ్వరం, మల్లేశ్వరం, అమరేశ్వరమనే పంచేశ్వర క్షేత్రాల్లో ఒకటిగా వెలుగొందుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లా విడిపోయిన తరువాత జిల్లాలో ఉన్న ప్రముఖ శైవాలయంగా నిలుస్తోంది. దేవాలయం వాస్తు శిల్పకళతో విరాజిల్లుతుంది. ఆలయంలో 18,19 తేదీల్లో శివరాత్రి ఉత్సవాలను నిర్వహించేందుకు జగన్నాథ గట్టు అభివృద్ధి సమితి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.

కైలాసగిరి ఆలయంలో...

కర్నూలు నగరం సప్తగిరినగర్‌లోని శ్రీమణికంఠ అయ్యప్ప స్వామి ఆలయం ఆవరణలోని కైలాసగిరి దేవాలయంలో శివరాత్రి ఉత్సవాల సందర్భంగా 18వ తేదీ తెల్లవారు జామున 4 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పంచామృతాభిషేకాలు, రాత్రి 7 నుంచి 9 గంటలకు వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, హరికథ, రాత్రి 12 గంటలకు లింగోద్భవ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, సహస్ర కలశాభిషేకం, రాత్రి 1గంటకు పార్వతీ కైలాశేశ్వర కల్యాణోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బాలసాయి బాబా మందిరంలో...

కర్నూలు శ్రీ భగవాన్ బాలసాయి బాబా మందిరంలో శనివారం శివరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నట్లు బాలసాయి సేవా సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రామారావు తెలిపారు. ఉదయం 6 గంటలకు గణపతి పూజ, పంచామృతాభిషేకం, సాయంత్రం 6.30 గంటలకు మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు, అన్నాభిషేకం, రాత్రి 12.21 గంటలకు లింగోద్భవ సమయంలో విశేష ద్రవ్యాలతో అభిషేకాలు, అర్చనలు, తెల్లవారు జామున గణపతి, రుద్ర హోమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉత్సవాలు ఇలా..

- శ్రీ ఉమా సమేత రూపాల సంగమేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల సందర్భంగా నేడు (18వ తేదీ) తెల్లవారుజామున 5 నుంచి 9 గంటల వరకు పంచామృతాభిషేకం, 12 గంటల వరకు పాలాభిషేకం, రుద్రహోమం, మధ్యాహ్నం 1 గంటకు స్వామివారికి అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పిస్తారు.
- సాయంత్రం 6 గంటలకు దిన్నెదేవరపాడు గ్రామస్తులచే ప్రభోత్సవం నిర్వహిస్తారు.
- రాత్రి 12 నుంచి 1 గంట వరకు లింగోద్భవ అభిషేకం, 19వ తేదీ తెల్లవారు జామున 3 గంటలకు శివపార్వతుల కల్యాణం, స్వామివారి ప్రాకార పల్లకీ సేవ కార్యక్రమాలు ఉంటాయి.
- భక్తులు జాగరణ చేసేందుకు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు, హరికథ, భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.
- 19వ తేదీ సాయంత్రం 5 గంటలకు శివపార్వతుల రథోత్సవం నిర్వహిస్తారు.
- 18వ తేదీ ఉదయం 5 నుంచి 19వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఏపీఎస్ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. గడియారం ఆస్పత్రి, కొత్త బస్టాండ్, రాజ్‌విహార్, సీక్యాంప్, వెంకటరమణ కాలనీ, బళ్లారి చౌరస్తా, కల్లూరు, కృష్ణానగర్, దిన్నెదేవరపాడు మీదుగా జగన్నాథ గట్టుపైకి బస్సుల సౌకర్యం ఉంటుంది.

నేడు జగన్నాథగట్టుకు ప్రత్యేక బస్సులు

కర్నూలు(రాజ్‌విహార్): మహాశివరాత్రి సందర్భంగా జగన్నాథగట్టుకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ప్రజా రవాణ శాఖ కర్నూలు–2డిపో మేనేజరు సర్దార్ హుసేన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 6 నుంచి అర్ధరాత్రి 12గంటల వరకు ప్రయాణికుల రద్దీ మేరకు కర్నూలు కొత్త బస్టాండ్, పాత బస్టాండ్ నుంచి నడుపుతామని, ఇందులో చార్జీ రూ.30, సీ.క్యాంప్ నుంచి రూ.20 ఉంటుందని, వీటిని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

19న సాంఘిక నాటకాల ప్రదర్శన

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ రాత్రి 7 గంటలకు సీక్యాంప్ కళాక్షేత్రంలో సాంఘిక నాటకాల ప్రదర్శ ఉంటుందని కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు. సినిమా, టీవీ, రంగస్థల నటీ నటుల కాంబినేషన్‌తో కర్నూలులో ఆరు సంవత్సరాల తరువాత సాంఘిక నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. శ్రీ సాయి ఆర్ట్స్ – కొలకలకలూరు తెనాలి వారిచే నాటకాల ప్రదర్శన ఉంటుందన్నారు. రాత్రి 7 గంటలకు గమ్య స్థానాల వైపు, 8 గంటలకు ప్రేమతో నాన్న నాటకాలు ప్రదర్శిస్తారని తెలిపారు.

క్లుప్తంగా

రోగులకు నాణ్యమైన భోజనం అందించాలి



డైట్ భోజనాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన భోజనం అందించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం ఆయన రోగులకు అందుతున్న డైట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. డైట్ అందుకుంటున్న రోగులు, వారి కుటుంబీకులతో మాట్లాడి భోజనం ఎలాగుందని అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ మెనూ ప్రకారం రోగులకు డైట్ అందించాలని సిబ్బందికి ఆదేశించారు. రుచికరమైన భోజనం, టిఫిన్, స్నాక్స్ అందించాలని చెప్పారు. ఆయన వెంట ఆసుపత్రి సీఎస్ఆర్ఎంవో డాక్టర్ వెంకటేశ్వరరావు ఉన్నారు.

తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టర్ పి.కోటేశ్వరరావును ఆయన కార్యాలయంలో కలసి విన్నవించారు. మూడు నెలల క్రితం తొలగించిన వారిలో 30 మందికి ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు

- జిల్లా ట్రెజరీకి ఐదుగురు ఆఫీసు సబార్టినేట్‌లు



పోస్టింగ్ ఉత్తర్వులను అందజేసిన జిల్లా ట్రెజరీ డీడీ రామచంద్రరావు

కర్నూలు(అగ్రికల్చర్): కారుణ్య నియామకాల కింద ఖాళీలు, రోస్టర్ అనుసరించి జిల్లా ట్రెజరీకి ఐదుగురు ఆఫీసు సబార్డినేట్‌లను కేటాయించారు. వీరికి స్థానాలు కేటాయిస్తూ జిల్లా ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్రరావు ఉత్తర్వులను అందచేశారు. జిల్లా ట్రెజరీకి నాగార్జున, కర్నూలు డివిజన్ సబ్ ట్రెజరీకి సునీత, మాధవీ బాయి, బనగానపల్లె సబ్ ట్రెజరీకి బి.మురళీకృష్ణుడు, నందికొట్కూరు సబ్ ట్రెజరీకి జి.వసంత్‌లను ఆఫీసు సబార్డినేట్‌లుగా నియమించారు. కార్యక్రమంలో ఎస్‌టీవో పలనాటి సునీల్‌కుమార్, సీనియర్ అకౌంటెంటు సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

బీబీసీపై వేధింపులు ఆపాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టు సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): బీబీసీ న్యూస్ ఛానల్ కార్యాలయంపై ఐటీ దాడులను తక్షణమే ఆపాలని జర్నలిస్టు సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. శుక్రవారం కలెక్టరేట ఎదుట ఏపీయూడబ్ల్యూజేఎఫ్, ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ సత్యన్న మాట్లాడుతూ..గుజరాత్ నరమేధంలో నరేంద్రమోదీ పాత్ర గురించి ఇటీవల బీబీసీ ఒక డాక్యుమెంట్‌ను ప్రచారం చేసిందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకున్న కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ, ముంబా యిలలోని బీబీసీ కార్యాలయాల్లో ఐటీ దాడులను నిర్వహిస్తోందన్నారు. ఇది మీడియా స్వేచ్ఛను అరికట్టడమే అవుతుందని, తక్షణమే వేధింపులు ఆపాలని కోరారు. అనంతరం కలెక్టర్ పి.కోటేశ్వరరావుకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, కొండప్ప, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : పఠాన్, వాల్తేరు వీరయ్య, అమిగోస్, యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా, షెహ్జాదా, సార్, వినరో భాగ్యము విష్ణు కథ, శ్రీదేవి శోభన్‌బాబు

మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : వీరసింహారెడ్డి, అమిగోస్, యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా, సార్, వినరో భాగ్యము విష్ణు కథ, శ్రీదేవి శోభన్‌బాబు, ఊ అంటావా మావా ఊఊ అంటావా

వెంకటేష్ సినీ కాంప్లెక్స్: వాల్తేరు వీరయ్య, సార్, వినరో భాగ్యము విష్ణు కథ

ఐనాక్స్ : పఠాన్, యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా, షెహ్జాదా, రైటర్ పద్మభూషణ్, అవతార్ ది వే ఆఫ్ వాటర్

భరత్ కాంప్లెక్స్ : పఠాన్, మేఖేల్, షెహ్జాదా

రాజ్ : ఊ అంటావా మావా ఊఊ అంటావా

శ్రీరామ : యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా

విజయ: సార్

'నగరం'...నయా సోయగం



పచ్చని చెట్లు, పెయింటింగ్‌తో అందంగా ఉన్న కొండారెడ్డి బురుజు ప్రాంతం



కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంతంలో...,



కర్నూలు వైద్య కళాశాల ఎదురుగా డివైడర్‌కు రంగులు వేస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): కర్నూలు నగరం మరింత అందంగా ముస్తాబవుతోంది. పాలక వర్గం వచ్చిన తరువాత నగరంలో అభివృద్ధి పనులు, పచ్చదనం, పారిశుద్ధ్యం వంటి వాటికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో పచ్చదనం పెంపొందించడం కోసం 75 వేల మొక్కలు నాటారు. రోడ్ల వెంట 8 నెలల క్రితం నాటిన మొక్కలు కాస్తా చెట్లుగా మారి చూపరులను ఆకర్షిస్తున్నారు. ప్రస్తుతం కర్నూలులో పెద్ద ఎత్తున కలర్ పెయింటింగ్ పనులు జరుగుతున్నాయి. కొండారెడ్డి బురుజు నుంచి సుంకేసుల రోడ్డు, ఆర్ఎస్ రోడ్డు నుంచి రైల్వేస్టేషన్, కిడ్స్ వరల్డ్ నుంచి రాజ్ విహార్, మౌర్య కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి, బిర్లా గేట్, గాయత్రీ ఎస్టేట్, సీ.క్యాంపు, సుంకేసుల రోడ్డు, మామిదాల పాడు చెక్‌పోస్టు వరకు, సీ.క్యాంపు నుంచి నంద్యాల చెక్ పోస్టు వరకు అన్ని ప్రాంతాల్లో పెయింటింగ్ పనులు, అందమైన బొమ్మలు వేయిస్తున్నారు. రూ.50 లక్షలు వెచ్చించి నగరమంతా ఈ పనులు చేస్తున్నారు. ప్రతి డివైడర్, సెంటర్ మీడియన్స్, సర్కిళ్లు, ఫౌంటెన్లు, ఫ్లైఓవర్లను పెయింటింగ్‌లతో సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. దీంతో కర్నూలు నగరం నయా సోయగంతో కనువిందు చేస్తోంది.

11 మంది వార్డు కార్యదర్శులకు అదనపు బాధ్యతలు

కర్నూలు (టౌన్): నగర పాలక సంస్థ పరిధిలోని వివిధ సచివాలయాల్లో పనిచేసే వార్డు కార్యదర్శులు మెటర్నిటీసెలవు, వైద్య పరమైన సెలవులు, ఉన్నత చదువుల పేరుతో సెలవుల్లో ఉన్నారు. దీంతో పాలన పరంగా ఇబ్బందులు వస్తున్నట్లు గుర్తించిన నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ 11 మంది వార్డు కార్యదర్శులకు అదనపు బాధ్యతలు అప్పగిస్తు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కె.శివ ప్రసాద్ (కిందగేరి), పి.బసవరాజు (బుధవారపేట), పి.సువర్ణ (జొహరాపురం), బి.ప్రసన్న (లక్ష్మీనగర్), రవి (శరీన్ నగర్), బి.రామ్ ప్రసాద్ (ముజఫర్‌నగర్), బి.మోహన్ (అంబేడ్కర్ కాలనీ), పి.అరవింద్ కుమార్ (రాజీవ్‌నగర్), సునీత (మార్కెట్‌యార్డు), షేక్ సఫియా (ఎస్ఆర్ పేట), ఆర్. నాగేంద్ర (బాలాజీనగర్)లకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

కల్లూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఐసీడీఎస్ పీడీ కేఎల్ఆర్‌కే కుమారి అన్నారు.శుక్రవారం కల్లూరులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. పూర్వప్రాథమిక కార్యక్రమాల అమలు, పిల్లల బరువు, ఎత్తును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పిల్ల లకు పోషకాహార లోపం లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి రెండు గంటలకు ఒక్కసారి రోజుకు ఎనిమిదిసార్లు ఆహారం అందించా లని సూచించారు. గర్భిణులు, అంగన్‌వాడీ కేంద్రాల్లోనే భోజనం చేసేలా ప్రోత్సహించాలన్నారు.

శిశువుకు కృత్రిమ అన్నవాహిక ఏర్పాటు



శస్త్రచికిత్స చేసిన నవజాతశిశువుతో వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరంలోని శ్రీ సాయిమేఘా హాస్పిటల్‌లో నవజాత శిశువుకు కృత్రిమ అన్నవాహిక, వాయునాళం ఏర్పాటు చేసి ప్రాణం పోశారు వైద్యులు. వివరాలను చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ అమరనాథ్‌రెడ్డి శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. తెలంగాణా రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా కుచ్చినెర్ల గ్రామానికి చెందిన తలారి రంగనాయుడు, తలారి సుజాతలకు నాలగవ సంతానంగా బాబు జన్మించాడన్నారు. ఈ బాబుకు పుట్టుకతోనే అన్నవాహిక, వాయునాళం పూర్తిగా ఏర్పడలేదని, దీనివల్ల ఆహారం, శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతుండటంతో తమ ఆసుపత్రిలో చేర్చారన్నారు. బాబుకు ఇటీవలే చిన్నపిల్లల శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ కృష్ణనాయక్, అనెస్తెటిస్ట్ డాక్టర్ విశాల కలిసి శస్త్రచికిత్స ద్వారా కృత్రిమంగా ఆహార, వాయునాళం ఏర్పాటు చేశారన్నారు. ఆపరేషన్ విజయవంతం అయి బాబు కోలుకోవడంతో శుక్రవారం డిశ్చార్జ్ చేసినట్లు ఆయన వివరించారు.

లింగనిర్ధారణ పరీక్షలు నేరం



మాట్లాడుతున్న శ్రీనివాసులు

కర్నూలు(హాస్పిటల్): గర్భస్థ లింగనిర్ధారణ పరీక్షలు చట్టప్రకారం నేరమని జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం కేవీఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో లింగవివక్ష నిర్మూలన, గర్భస్థ లింగనిర్ధారణ వ్యతిరేక చట్టం(పీసీ పీఎన్‌డీటీ యాక్ట్), ఆడపిల్లల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ లింగనిర్ధారణ పరీక్షలు అరికట్టాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం పీసీ పీఎన్‌డీటీ చట్టాన్ని అమలులోకి తెచ్చిందన్నారు. సమాజంలో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనని, స్త్రీ పురుషుల మధ్య ఎలాంటి వివక్షా ఉండకూడదన్నారు. ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ స్త్రీలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారని చెప్పారు. సీడీపీవో ఇందిరమ్మ మాట్లాడుతూ ఆడపిల్లను బ్రతుకనిద్దాం–ఆడపిల్లను చదవనిద్దాం అనే నినాదాన్ని అందరూ పాటించాలన్నారు. ఈ విషయమై విద్యార్థినులతో పాటు వారి కుటుంబసభ్యులు, బంధువులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి, ఎస్‌బీసీసీ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, మహిళా పోలీస్ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ఆరోగ్య కేంద్రాల తనిఖీ



పట్టణ ఆరోగ్యకేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.రామగిడ్డయ్య శుక్రవారం నగరంలోని వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. స్థానిక డాక్టర్స్ కాలనీ, ఎన్‌టీఆర్ కాలనీ, శ్రీరామనగర్‌లలోని కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ రికార్డులు, ఇతర ఆరోగ్య కార్యక్రమాల ప్రగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించాలని, ఈ మేరకు ఆరోగ్య కేంద్రం పరిధిలోని వార్డులు సందర్శించి ప్రజలకు వారానికి ఒకసారి నీటినిల్వలు లేకుండా పూర్తిగా తొలగించి దోమల పెరుగుదలను అరికట్టే విధంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలాగే పట్టణాల్లోని యూపీహెచ్‌సీలలో వ్యాధినిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తారని, ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి



బిర్లాగేట్ సమీపంలో చేపడుతున్న పనులను పరిశీలిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): నగరంలో రూ.కోట్లు వెచ్చించి చేపడుతున్న అభివృద్ధి పనుల్లో మరింత వేగం పెంచాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. శుక్రవారం కమిషనర్ నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. స్థానిక హంద్రీ బ్రిడ్జి వద్ద, బిర్లాగేట్ వద్ద రూ.2 కోట్లతో ఏర్పాటు చేస్తున్న ఈట్ స్ట్రీట్ పనులు, పాతబస్టాండ్ కొండారెడ్డి బురుజు వద్ద రూ.2 కోట్లతో చేపడుతున్న పనులు, రాజ్‌విహార్ వద్ద డివైడర్ పనులు, వెంకటరమణ కాలనీ, గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎస్ఈ శేషాసాయి, ఈఈ షాకీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆయన నగరంలోని వివిధ కాలనీలలో ఉదయం పారిశుద్ధ్య పనులు తనిఖీ చేసి పారిశుద్ధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి

ఓర్వకల్లు: వివిధ శాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో పనిచేసి కాల్వబుగ్గలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన బుగ్గరామేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో చేపట్టిన ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు సమకూర్చాలని చెప్పారు. ప్రధానంగా మహిళ భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. భారీ సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్న సమయంలో తొక్కిసలాటలు, అల్లర్లు జరగకుండా పోలీసుల సహకారంతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆలయాధికారులకు ఆదేశించారు. అలాగే ప్రధాన రహదారిలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి, ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్, ఆలయ అర్చకులు కళ్లె లక్ష్మీనారాయణశర్మ, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు కంటి అద్దాల పంపిణీ

కర్నూలు కల్చరల్: కర్నూలు జిల్లా రంగస్థలం కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మద్దూరునగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో పలువురు కళాకారులకు కంటి వైద్య పరీక్షలు చేయించి కంటి అద్దాలు, ట్యాబ్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు జి.అంకయ్య మాట్లాడుతూ సంఘం తరుపున కళాకారులకు అన్ని విధాల అండగా నిలుస్తున్నామన్నారు. జీవిత ప్రమాద బీమా సౌకర్యం దాతల సహకారంతో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు దస్తగిరి, ప్రధాన కార్యదర్శి హనుమంతరాయ చౌదరి, కార్యనిర్వాహక కార్యదర్శి బైలుప్పల షఫి, సభ్యులు పాల్గొన్నారు.

దోమలు పుట్టకుండా చూడాలి

కర్నూలు(హాస్పిటల్): ఇళ్లలోని వాడుకనీటిలో దోమలు పుట్టకుండా చూసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక వీకర్‌సెక్షన్ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు, మురుగునీరు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటిలో వాడుకలో ఉన్న డ్రమ్ములు, కుండీలలో నీటిని ఎక్కువరోజులు నిల్వ ఉంచుకోవద్దని చెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే కీటకజనిత వ్యాధులైన మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికున్‌గున్యా ప్రబలే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం అధికారిణి డాక్టర్ నందిని, వార్డు హెల్త్ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సారా కేసులో మహిళ అరెస్టు

కర్నూలు: కర్నూలు వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని జొహరాపురం దర్గా వద్ద నాటుసారా విక్రయిస్తున్న అదే గ్రామానికి చెందిన సయ్యద్ మహబూబ్‌బీని శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి 2 లీటర్ల నాటుసారా రూ.800 నగదుతో పాటు మట్కా చీటీలు స్వాధీనం చేసుకున్నారు. ఈమె భర్త సయ్యద్‌బాషా మట్కా బీటర్‌గా వ్యవహరిస్తున్నాడు...భార్య అతనికి సహకరిస్తోంది. సయ్యద్‌బాషా ఇటీవలనే మట్కా కేసులో జైలుకు వెళ్లి బెయిల్‌పై విడుదలయ్యాడు. మళ్లీ భార్య మహబూబ్‌బీతో కలిసి మట్కా నిర్వహిస్తు అదనపు ఆదాయం కోసం సారా విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం అందడంతో ఒకటవ పట్టణ పోలీసులు దాడి చేయగా సయ్యద్‌బాషా పారిపోయాడు. భార్య మహబూబ్‌బీపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్జేడీపై దాడి హేయమైన చర్య

కర్నూలు సిటీ: పాఠశాల ప్రాంతీయ కార్యాలయ అధికారి(ఆర్జేడీ) ప్రతాప్‌రెడ్డిపై దాడిని అప్టా రాష్ట్ర, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.జి.ఎస్ గణపతిరావు, ప్రకాష్‌రావు, ఎం.మధుసూదన్‌రెడ్డి, ఆర్.సేవా నాయక్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఆర్జేడీపై అపవాదులు మోపడం తగదన్నారు. గురువారం జరిగిన సమావేశంలో ఎన్నికల పరమైన అంశాలు ఉన్నదని భావిస్తే తగిన సాక్ష్యాలతో ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు చేయవచ్చునన్నారు. విద్యాశాఖలో పని చేస్తున్న ఉన్నతాధికారిపై భౌతిక దాడులు, దౌర్జన్యపూరిత చర్యలకు పాల్పడడం హేయమన్నారు.

నారాయణ కాలేజీ బ్రాంచ్ వార్షికోత్సవం



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

కర్నూలు సిటీ: నారాయణ జూనియర్ కాలేజీ శ్రీలక్ష్మీనగర్ బ్రాంచ్ వార్షికోత్సవం శక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆ కాలేజీల కోర్ డీన్ పి.లింగేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాబోతున్న థీయరీ, ప్రాక్టికల్ పరీక్షల్లో విద్యార్థులు చక్కని ప్రణాళికతో చదవాలన్నారు. వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో కాలేజీ డీన్ ఆంజనేయ రెడ్డి, ప్రిన్సిపాల్ కౌసల్య, అధ్యాపక బృందం పాల్గొన్నారు.